
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

3

ఆదివారం 28 జనవరి 2024





ఈ మధ్య కాలంలో వచ్చిన మాంచి మాస్ సినిమాలో ఓ సీన్ గుర్తుందా... సరుకు రవాణా చేసే కంటెయినర్‌ను ఆపడానికి అంతా భయపడి పోతుంటారు... దానిపై ఉన్న సీల్‌ను చూసి వణికిపోతారు. గుర్తొచ్చింది కదూ.. అదే తరహా ఉమ్మడి జిల్లాలో దందా సాగుతోంది. అధికార పార్టీ నేతలకు కప్పం కడితే చాలన్నట్లుగా గ్రానైట్ అక్రమ రవాణా సాగుతోంది. ఆ సినిమాలో సీల్ మాదిరిగానే ఇక్కడ టోకెన్ సిస్టం నడుస్తోంది. టోకెన్ ఉన్న లారీని ఎక్కడా ఎవరూ ఆపరు. ఎవ రైనా ఆపితే తామే చూసుకుంటామని గ్రానైట్ అక్రమ రవాణా ముఠా భరోసా ఇస్తుందని చెబుతున్నారు. ఎక్కడైనా ఏ అధికా రైనా టోకెన్ ఉన్న లారీని ఆపితే సదరు ముఠా రంగంలోకి దిగి సురక్షితం గా గ్రానైట్ లారీని రాష్ట్ర సరిహద్దు దాటిస్తోంది. ఇలా నాగార్జునసాగర్, నార్కెట్‌పల్లి రెండు రహదారుల్లో రాత్రివేళ పెద్దఎత్తున గ్రానైట్ లారీలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తు న్నారు. ఇందుకు లారీకి రూ.35 వేలు వసూలు చేస్తున్నారు. అడిగే వారు ఉండరు.. అడ్డుకునే వారు ఉండరు.. వే బిల్లు అక్కరలేదు. అధికారం మాటున కొందరు వైసీపీ ముఖ్య నేతలు ఇలా బరితెగిస్తు న్నారు. ప్రభుత్వ అదాయానికి కోట్లల్లో గండి కొడుతున్నారు.

టోకెన్ ఉంటే.. నో స్టాప్!

గ్రానైట్ దందాకు రైట్..రైట్

- గుట్టుగా గ్రానైట్ అక్రమ రవాణా
- లారీకి రూ.35 వేలు అక్రమ వసూళ్లు
- అధికారం అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- సహకరిస్తున్న అధికార పార్టీ నేతలు
- ఓ నేతకు లారీకి రూ.10 వేలు, మరో నేతకు రూ.5 వేలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చీకటి వ్యాపారంపై కన్నెత్తి చూడని పన్నుల శాఖ
- సాగర్, నార్కెట్‌పల్లి రెండు రహదారుల్లో అక్రమ రవాణా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎటువంటి పన్ను చెల్లించకుండానే గ్రానైట్ లారీలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. దీనికి ఒక పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోంది. పన్నుల శాఖ అధికారులు గ్రానైట్ అక్రమ రవాణా వైపు కన్నెత్తి చూసే సాహసం చేయరు. చిలకలూరిపేట, నరసరావుపేట, ప్రకాశం జిల్లా సంతమాగులూరు, చీమకుర్తి, బల్లికురవ మండలాల పరిధిలో గ్రానైట్ పరిశ్రమలు, క్వారీలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి రోజు పెద్దఎత్తున గ్రానైట్ ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు గ్రానైట్ ఎగుమతి చేస్తున్నారు. పల్నాడు జిల్లా గుండా రాష్ట్ర సరిహద్దులు దాటే గ్రానైట్‌కు మాత్రం వేబిల్లులు ఉండవు. వీరు పన్ను కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ అక్రమ గ్రానైట్ దందా రాత్రి వేళల్లో యథేచ్ఛగానే సాగుతోంది. నరసరావుపేట, సంతమాగులూరు, చిలకలూరిపేట ప్రాంతాల్లోని ఫ్యాక్టరీల నుంచి గ్రానైట్ లారీలు పిడుగురాళ్ళ, దాచేపల్లి మీదుగా, చీమకుర్తి, బల్లికురవ ప్రాంతాల నుంచి వచ్చే లారీలు నాగార్జున సాగర్ రహదారి గుండా తెలంగాణాలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ ప్రక్రియకు కావలసిన అన్ని ఏర్పాట్లను అక్రమార్కులు చేస్తున్నారు.

టోకెన్ ఉంటే ఓకే...

కోటప్పకొండ మీదుగా నరసరావుపేట బైపాస్ రోడ్డుకు రాత్రివేళ గ్రానైట్ లారీలు చేరుకుంటాయి. అక్కడ నుంచి లారీలను రాష్ట్ర సరిహద్దులు దాటించే ముఠా రంగంలోకి దిగి డ్రైవర్లకు టోకెన్లు జారీ చేస్తారు. టోకెన్ ఉన్న లారీని ఎక్కడా ఎవరూ ఆపరని ఎవరైనా ఆపితే తామే చూసుకుంటామని సదరు ముఠా భరోసా ఇస్తుందని చెబుతున్నారు. ఎక్కడైనా ఏ అధికారైనా టోకెన్ ఉన్న లారీని ఆపితే సదరు ముఠా రంగంలోకి దిగి సురక్షితంగా గ్రానైట్ లారీని రాష్ట్ర సరిహద్దు దాటిస్తోంది. అధికార పార్టీ నేతలతో పాటు కొందరు అధికారులు అక్రమ రవాణాలో సూత్రధారులుగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. గ్రానైట్ లారీల నుంచి పన్ను వసూలు చేసే సాహసం పన్నుల అధికారులు చేసే పరిస్థితులు లేవు. అక్రమ రవాణాపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకుండా సదరు అధికారులు మిన్నకుంటున్నారన్న విమర్శలున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండి..

ప్రభుత్వం ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమ మార్కులు వారి జేబు లు నింపుకొంటున్నారు. అధికార ముఖ్య నేతలు కొందరికి గ్రానైట్ అక్రమ రవాణా కాసుల వర్షం కురిపిస్తున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.5 లక్షల విలువ కలిగిన గ్రానైట్ లోడు రవాణా చేయాలంటే వే బిల్లు తీసుకోవాలి. 28 శాతం పన్ను చెల్లించాలి. రూ.5లక్షలకు 28 శాతం చొప్పున రూ.1.40 లక్షలు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అక్రమార్కులు కోరిన విధంగా రూ.35 వేలు చెల్లిస్తే ఈ పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. నెలకు వందల సంఖ్యలో గ్రానైట్ లారీలు రాష్ట్ర సరిహద్దులు దాటిపోతున్నాయి. నెలకు సుమారు ఐదు కోట్ల రూపాయలు చేతులు మారుతున్నట్టు తెలుస్తోంది. అక్ర మార్కుల సంపాదన ఈ స్థాయిలో ఉంటే రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నట్టు సమాచారం. పన్నుల శాఖ అధికారి ఒకరు మాట్లా డుతూ గ్రానైట్ పన్ను ఆదాయం 90 శాతానికి పైగా తగ్గిందని చెప్పడం గమనార్హం. అధికార పార్టీకి చెందిన నలుగురు నేతలకు నెల నెలా మా మూళ్లు అందిస్తున్నారని విస్తృత ప్రచారం జరుగుతోంది. ఒక నేతకు లారీకి రూ.10 వేలు, ఇతర నేతలకు లారీకి రూ.5 వేలు చెల్లిస్తున్నట్టు తెలుస్తోంది.



బల్లికురవ పోలీస్‌స్టేషన్ వద్ద పట్టుబడ్డ గ్రానైట్ రాయి లారీలు

లైన్ మామూళ్ళు ముట్టితేనే.. లేదంటే కేసులే..

అద్దంకి, జనవరి27: అక్రమ గ్రానైట్ రవాణా సంతమాగులూరు సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. గ్రానైట్ రవాణా చేసే ముఠా నెలవారీ మామూళ్ళు చెల్లించుకుంటునే సరిహద్దు దాటేది. లేదంటే సంతమాగు లూరు అడ్డరోడ్డు వద్ద గ్రానైట్ లారీ ఆగి పోవాల్సిందే. బల్లికువర, సంతమాగులూరు మండలాల పరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి నిత్యం 30 నుండి 40 వరకు గ్రానైట్ శ్లాబుల లారీలు ఇతర రాష్ట్రాల కు వెళ్తుంటాయి. అత్యధిక శాతం నామ్ రోడ్డు గుండా మహారాష్ట్రకు వెళ్తుంటాయి. శ్లాబుల రవాణాకు బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతంలో సుమారు 20 బృందాలు ఉన్నాయి. వారి కనుసన్నల్లోనే గ్రానైట్ శ్లాబుల ఎగుమతి జరుగుతుంది. సీనరేజ్ వసూ లుకు పాత గుంటూరు జిల్లా పరిధిలో ప్రైవేట్ ఏజెన్సీ టెండర్ దక్కించుకుంది. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నారు. అక్కడ ప్రైవేట్ ఏజెన్సీకి చెల్లించే రుసుముతో పాటు అదనంగా ముట్టచెబుతుంటారు. అయితే ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ఇంకా ఎక్కడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయలేదు. ఇది సంతమాగులూరు సర్కిల్ పరిధిలోని పోలీసులకు మరింత కలిసొచ్చింది. గ్రానైట్ రవాణా చేసే ఒక్కో బృందం నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల చొప్పున పోలీసుల కు ముట్టచెబుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో నెలవారీ 5 నుంచి 6 లక్షల రూపాయల వరకు లైన్ మామూళ్ల రూపేణ పోలీస్‌లకు చేరుతుందని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. అక్రమ రవాణా అడ్డుకున్నట్లు చెప్పుకునేందుకు, ఉన్నతాధికారుల మెప్పు కోసం హడావుడి చేస్తుంటారన్న విమర్శలు వస్తున్నాయి. కానీ అన్ని లారీలను అడ్డుకోవాల్సి ఉండగా, ప్రత్యేకించి కొన్నింటిని మాత్రమే అడ్డుకొని కేసులు నమోదు చేయటం చూస్తే పోలీస్ అధికారులపై వస్తున్న విమర్శలకు మరింత బలం చేకూరుతుంది. వసూళ్లకు ఆయా స్టేషన్లలో ప్రత్యేకంగా కొంతమంది సిబ్బందిని కేటాయించి వారి ఆధ్వర్యంలో వసూళ్ల పర్వం సాగుతున్నట్లు తెలుస్తోంది.

రా కదలి రా సభకు చురుగ్గా ఏర్పాట్లు

- రేపు వడ్లమూడిలో 20 ఎకరాలో సభ
- 35 ఎకరాలో పార్కింగ్

రాజధాని రైతులను రోడ్డున నిలబెట్టారు

- 1502వ రోజుకు రైతుల ఆందోళనలు

4లో..



ఉండవల్లిలో టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్ సమక్షంలో పార్టీలో చేరిన దుగ్గిరాల వైసీపీ నేతలు



కార్పొరేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్పొరేటర్లు

తప్పుడు ధ్రువీకరణ పత్రంతోనే..

మంత్రి రజినికి ఓటు

- తొలగించాలని ఫారం-7 అందజేసినా చర్యలు శూన్యం
- జీఎంసీ విచారణకు మంత్రి రజిని గైర్హాజరు
- తక్షణమే చర్యలు చేపట్టాలి: కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 27: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తప్పుడు ధ్రువీకరణ పత్రం పెట్టి గుంటూరులో ఓటు హక్కు పొందారని టీడీపీ నాయకులు ఆరోపించారు. గతంలో ఆమె ఖాళీ స్థలానికి పొందిన ఓటు హక్కుకు సంబంధించి పూర్తి సమాచారంతో టీడీపీ నాయకులు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివజ్యోతికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం విచారణకు హాజరుకావాలని మంత్రి రజినికి, టీడీపీ నాయకుడు కనపర్తి శ్రీనివాసరావులకు ఆర్వో నుంచి నోటీసులు అందాయి. దీంతో కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, వేములపల్లి శ్రీరాంప్రసాద్, ఎల్లావుల అశోక్ యాదవ్, మైనార్టీ నాయకులు పటాన్ అస్మతుల్లా, షేక్ అబ్దుల్ కరీం తదితరులు గుంటూరు నగరపాలక సంస్థకు చేరుకున్నారు. అధికారులు ఇచ్చిన నోటీసుల ప్రకారం విచారణకు వారు హాజరు కాగా, మంత్రి రజిని గైర్హాజరు అయ్యారు. టీడీపీ నాయ కులు ఆర్వో శివజ్యోతితో భేటీ అయ్యారు. ఆమెతో చర్చించిన అనంతరం బయట మీడి యాతో మాట్లాడారు. విచారణకు మంత్రి రజిని గైర్హాజరు కావటం పలు అనుమానాలకు దారి తీస్తోందని ఆరోపించారు. ఆమె వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, పోలీస్ ఎస్కార్ట్‌ను కూడా ఆమె ఓటు పొందిన అడ్రస్‌కు పంపటం లేదని పోలీసు ఉన్నతాధికారుల నుంచి సమాచారం సేకరించామన్నారు. సరైన చర్యలు తీసుకోకపోతే, జీఎంసీ కార్యాలయం ముట్టడిస్తామని టీడీపీ నాయకులు హెచ్చరించారు.

గెలుపు కాదు.. రికార్డు మెజారిటీనే ముఖ్యం

- టీడీపీ శ్రేణులతో లోకేశ్

మంగళగిరి, జనవరి 27: మంగళగిరిలో గెలుపు ముఖ్యం కాదు.. రికార్డు స్థాయిని మెజారిటీని సాధించడమే లక్ష్యమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. భారీ మెజారిటీని సాధించేదిశగా పార్టీలో చిన్నాపెద్దానేతలు.. కొత్త పాత నాయకులందరూ కలిసి ఐక్యంగా పనిచేయాలని ఆయన పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఉండవల్లిలోని తన నివాసంలో శనివారం సాయంత్రం నియోజకవర్గంలోని దుగ్గిరాల మండల వైసీపీ నాయకులు భారీగా టీడీపీలో చేరిన సందర్భంగా వారిని ఉద్దేశించి లోకేశ్ ప్రసంగించారు. గత ఎన్నికల్లో తాను మంగళగిరిలో ఓటమి చెందడం తనకెంతో బాధను కలిగించినా, ఎన్నో అవమానాలకు గురి చేసినా తాను కుంగిపోలేదన్నారు. ఆ ఓటమి తనలో కసిని పెంచిందన్నారు. పార్టీకి కంచుకోట వంటి నియోజకవర్గాల్లో పోటీ చేసి కాలర్ ఎగరేసే రకాన్ని తాను కాదన్నారు. టీడీపీ జెండా ఎగరని చోట భారీ మెజారిటీతో గెలిచి చూపడమే నిజమైన గెలుపు.. నిజమైన ఆనందమని అన్నారు. ఆ లక్ష్యసాధన కోసం మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు బాగా చేరువ అయ్యేందుకు తనవంతు కృషి చేశానన్నారు. అధికారం చేతిలో లేకున్నా నియోజకవర్గంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశానన్నారు. ఇక పార్టీ విషయానికొస్తే తానెప్పుడూ సీనియర్లను గౌరవిస్తానన్నారు. అదే సందర్భంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారిని ప్రోత్సహిస్తానన్నారు. గత ఎన్నికల్లో ఓటమి దృష్ట్యా కొందరు ఇపుడు మంగళగిరి వద్దు ఉత్తరాంధ్ర నుంచి పోటీ చేయమని సలహాలను ఇచ్చారు. కానీ నాకెందుకో మంగళగిరి ప్రజలతో మంచి అనుబంధం ఏర్పడింది. అందుకే ఇక్కడినుంచే పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందాలని చాలా సిన్సియర్‌గా పనిచేస్తున్నానని చెప్పుకొచ్చారు. రానున్న 72 రోజులు ముఖ్యమని పట్టు విడవకుండా పార్టీ కార్యకర్తలందరూ కలిసికట్టుగా అరమరికలు లేకుండా పనిచేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. భారీ మెజారిటీతో గెలిస్తేనే మంగళగిరిని ఒక మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేయడానికి తనకో మంచి అవకాశం లభిస్తుందని లోకేశ్ చెప్పారు.



4లో..

క్రైస్తవ జీవితం.. ఆదర్శనీయం

- జె.శామ్యూల్ కిరణ్
- రెండో రోజు బైబిల్ మహోత్సవాలకు పోటెత్తిన భక్తులు

రా కదలిరా సభకు.. ముమ్మర ఏర్పాట్లు



వేదిక నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న నరేంద్ర కుమార్ తదితరులు

చేబ్రోలు, జనవరి27: చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం జరగనున్న రా కదలిరా బహిరంగ సభకు విస్తృత ఏర్పాట్లు సాగుతున్నాయి. సభను విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన నాయకులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఇప్పటికే పొన్నూరు పట్టణంలో తెలుగు యువత ఊరూరా ద్విచక్రవాహన ర్యాలీ ద్వారా సభకు రావాలన్ని ప్రచారం చేసింది. ఈ సభలో ఆహూతుల కోసం 20 ఎకరాల ప్రదేశాన్ని చదును చేసి సిద్ధం చేశారు. సభా వేదికపై 100 మంది ప్రముఖులు ఆశీనులయ్యేలా సభా వేదికను మూడున్నర ఎకరాల్లో ఏర్పాటు చేయడానికి శనివారం భూమి పూజ చేశారు. వేదిక సమీపంలోనే 3 ఎకరాల భూమిని చంద్రబాబు హెలీప్యాడ్ కోసం సిద్ధం చేశారు. తెనాలి, గుంటూరు వంటి మార్గాల్లో పెద్ద ఎత్తున తరలివచ్చే నాయకులు, కార్యకర్తల వాహనాల కోసం 35 ఎకరాల భూమిని పార్కింగ్ కోసం వివిధ ప్రాంతాల్లో రెడీ చేశారు. తెనాలి డీఎస్పీ జనార్ధన రావు శనివారం సభా వేదిక వద్దకు వచ్చి ఏర్పాట్ల గురించి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సభకు వచ్చే అభిమానుల కోసం ఆహారం, మంచి నీరు సిద్ధం చేస్తున్నారు. పోలీసు బందోబస్తే కాకుండా సభా నిర్వహణ సక్రమంగా జరిగేలా ప్రైవేటు సెక్యూర్టీ, తెలుగు యువతను పెద్ద ఎత్తున వలంటీర్లుగా నియమించారు. ఈ ఏర్పాట్లను పార్టీ పరిశీలకులు, ఎంఎల్‌సీ రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

నేడు ఎంపీ జయదేవ్ వీడ్కోలు విందు

గుంటూరు, జనవరి 26: ప్రత్యక్ష రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్న గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ఆదివారం గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్‌లో వీడ్కోలు విందు ఇవ్వనున్నారు. ఈ మేరకు శనివారం ఉదయమే గుంటూరుకు విచ్చేసిన ఎంపీ జయదేవ్ తల్లి, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి విందు ఏర్పాట్లు పరిశీలించారు. గుంటూరు ఎంపీగా పనిచేసిన ఈ పదేళ్ళ కాలంలో తనకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన టీడీపీ నేతలకు, శ్రేణులకు, అభిమానులకు వీడ్కోలు చెబుతూ ఆత్మీయ విందు ఇవ్వనున్నట్లు తెలిపారు. విందు సమావేశానికి టీడీపీ ముఖ్య నేతలు హాజరుకానున్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

● లోకేశ్ సమక్షంలో పార్టీలో చేరిన దుగ్గిరాల వైసీపీ నేతలు



లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న దుగ్గిరాల వైసీపీ నేతలు ఎడమ నుండి వరుసగా పాటిబండ్ల హరిప్రసాద్, కృష్ణప్రసాద్, యేళ్ళ జయలక్ష్మి, యడ్ల వెంకటరావు

మంగళగిరి, జనవరి 27: దుగ్గిరాల మండలంలో వైసీపీ దాదాపు ఖాళీ అయింది. దుగ్గిరాల మండలానికి చెందిన పలువురు కీలకనేతలు తమ అనుచరులతో కలిసి భారీస్థాయిలో టీడీపీలో చేరారు.ఉండవల్లి నివాసంలో శనివారం సాయంత్రం వీరంతా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకొన్నారు. వీరందరికీ లోకేశ్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో దుగ్గిరాల మాజీ జడ్పీటీసీ సభ్యులు యడ్ల వెంకట్రావు, యేళ్ల జయలక్ష్మి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, పెదపాలెం సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, దుగ్గిరాల సొసైటీ ఛైర్మన్ పాటిబండ్ల హరిప్రసాద్, పెనుమూలి సర్పంచ్ కొరిటాల పద్మావతి, కొరిటాల సురేష్, తుమ్మపూడికి చెందిన వైసీపీ ముఖ్యనాయకుడు వాసిరెడ్డి లీలాప్రసాద్ తదితరులు వున్నారు. వీరితో పాటు పేరుకలపూడి, శృంగారపురం, కేఆర్ కొండూరు, వీర్లపాలెం, గొడవర్రు, పెదకొండూరు, తుమ్మపూడి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు వారి అనుచరులతో కలిసి పసుపు కండువాలను కప్పుకొన్నారు. ఈ ముఖ్యనాయకులలో చిలువూరుకు చెందిన కాలవ శంకర్, కట్టా రాము, పాలపర్తి సాయి, ఎన్.దుర్గారావు, కురగంటి బుజ్జి, పెదపాలెం మాజీ సర్పంచ్ బుల్లా శిఖామణి, నెలకుదిటి పిచ్చియ్య, రాజగోపాలం, నిరంజన్, జముడిగాని భుజంగరావు, శ్రీరామ్మూర్తి, దాడిగ గోపి, పెనుమూలికి చెందిన ఎస్‌కే జానీ, రహంతుల్లా, చెల్లంచెర్ల సాంబశివరావు, తోకల బాలాజీ, ఏనం శ్రీనివాసరావు, ఎం.దుర్గారావు, ఎస్‌కే ఖాదర్‌బాషా, పోపూరి బాలస్వామి, తుమ్మపూడికి చెందిన బి.రామదాసు తదితరులు వున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో ఫుల్ జోష్

మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవుతోంది. కార్యకర్తల స్థాయినుంచి మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి వైసీపీ నాయకులందరూ వరుసబెట్టి టీడీపీలో చేరిపోతున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి అప్రతిహతంగా సాగుతున్న ఈ వలసలను అడ్డుకోవడానికి వైసీపీ అధిష్ఠానం శాయశక్తులా కృషి చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం వుండడం లేదు. టీడీపీలోకి చేరనున్న వైసీపీ నాయకులతో విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి అగ్రనాయకులందరూ అసంతృప్త వైసీపీ నాయకులతో దఫదఫాలుగా చర్చలు జరుపుతున్నప్పటికీ వలసలను మాత్రం నిరోధించలేకపోతున్నారు. ఈ పరిణామాలు వైసీపీ అధిష్ఠానంలో గుబులు పుట్టిస్తున్నాయి. మరోపక్క భారీ చేరికలతో టీడీపీ ఫుల్ జోష్‌లో వుంది.

మెగా జాబ్ మేళా విజయవంతం

● 2,500 మంది హాజరు.. 500 మందికి నియామకపత్రాలు అందజేత
● ఐదేళ్లలో గురజాలలో నిరుద్యోగ సమస్య లేకుండా కృషి చేస్తా: యరపతినేని



జాబ్‌మేళాకు హాజరైన గురజాల నియోజకవర్గ యువతీ యువకులు

పిడుగురాళ్ల, జనవరి 27: రాబోయే ఐదేళ్లలో గురజాల నియోజకవర్గంలో ఉన్న యువతీ యువకులకు వారి అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా పెట్టుకున్నానని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శనివారం గురజాలలో మెగా జాబ్‌మేళా యరపతినేని ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు పల్నాడు వ్యవసాయమే ఆధారంగా వుండేదని, గత పదేళ్లుగా యువత ఉన్నత విద్యను అభ్యసించి దేశ, విదేశాలకు తరలిపోతున్నారన్నారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో హైటెక్‌సిటీని చంద్రబాబు ఏర్పాటు చేస్తే అప్పుడు కొన్ని రాజకీయ పార్టీలు హైటెక్ సిటీ గురించి అవహేళనగా మాట్లాడారని, ఇప్పుడు దేశానికే హైటెక్ సిటీ ఆదర్శంగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. టీడీపీ హయాంలో విశాఖ, తిరుపతి, విజయవాడలలో ఐటి పరిశ్రమలు తీసుకొస్తే వైసీపీ హయాంలో వున్నవి కూడా పక్క రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. గురజాల నియోజకవర్గం మొత్తం మీద ఓ యూత్ పాలసీని తీసుకొచ్చి పిడుగురాళ్ల, దాచేపల్లి ప్రాంతాలలో 400 ఎకరాలలో వివిధ రకాల పరిశ్రమలు పెట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాల ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించనున్నట్లు యరపతినేని వివరించారు. ఫిబ్రవరి నెలలో మరో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు సుమారు 2,500 మందికి పైగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని హాజరయ్యారు. ఈ జాబ్‌మేళాకు సుమారు 53 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రముఖ కంపెనీలైన టెక్ మహీంద్ర, ఎసెన్చర్, ఫ్లిప్‌కార్ట్, డైకిన్, డిక్సన్, పేటీఎం, ఎంఫసిస్, తదితర కంపెనీలు ఉద్యోగ మేళాకు హాజరయ్యాయి. అనంతరం సుమారు 500 మందికిపైగా వారి వారి విద్యార్హతలను బట్టి పలు కంపెనీలకు ఎంపికకాగా వారందరికీ యరపతినేని నియామకపత్రాలు అందజేశారు.

సీడీపీవో సీనియర్ అసిస్టెంట్ బాషా సస్పెన్షన్

● 'అధికార' నీడలో ఏళ్ల తరబడి అకృత్యాలు ● ఇప్పటికే రెండు పర్యాయాలు సస్పెండైనా మారని వైనం

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సమగ్రశిశు సంక్షేమ శాఖ పరిధిలోని గుంటూరు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కార్యాలయ(సీడీపీఓ) సీనియర్ అసిస్టెంట్ ఎస్‌కే జానీ బాషాపై సస్పెన్షన్ వేటు పడింది. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లపై బాషా చేస్తున్న లైంగిక వేధింపుల నేపథ్యంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్(ఎఫ్ఏసీ) కె.మాధురి అతణ్ణి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. గత రెండేళ్లుగా అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. బాషాపై వస్తున్న ఆరోపణలు రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖా మంత్రి ఉష శ్రీచరణ్ వరకూ వెళ్లడంతో అధికారులు విధిలేని పరిస్థితిలో అతణ్ణి సస్పెండ్ చేసినట్లు చర్చ జరుగుతోంది.

'అధికార' అండదండలు?

బాషాపై ఏడాదిన్నర క్రితమే అధికారులకు ఫిర్యాదులు అందాయి. అర్ధరాత్రి సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు అసభ్యకరమైన వాట్సాప్ మెసేజులు పంపించడం, ద్వంద్వార్థం వచ్చేలా మాట్లాడడంతో పలువురు ఉద్యోగులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో వారు యూనియన్‌ను ఆశ్రయించగా సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ సంఘం అధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అయితే బాషా సామాజిక వర్గానికి చెందిన అధికారపార్టీ ప్రజాప్రతినిధి, కార్పొరేషన్‌కు చెందిన మరో ప్రజా ప్రతినిధి జోక్యం కారణంగానే అతడిపై చర్యలు తీసుకోలేదని యూనియన్ నేతలు బలంగా ఆరోపిస్తు న్నారు. అదే సమయంలో స్థానిక అధికారిణి ఒకరు ఆయనను కాపాడేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించినట్లు తెలుస్తోంది.

ఆరోపణల వెల్లువ..

గుంటూరు సీడీపీఓకి రావడానికి ముందు పొన్నూరులో పనిచేసే సమయంలో లైంగిక వేధింపుల ఆరోపణలపై బాషా రెండుసార్లు సస్పెండైనట్లు ఉద్యోగులు చెబుతున్నారు. దీనికి తోడు అతనిపై పలు అవినీతి ఆరోపణలు వున్నాయి. గుంటూరు పరిధిలో వున్న అంగన్‌వాడీ సెంటర్లు అన్నీ తమ పదేళ్ల రికార్డులు చూపాలని తానే బయటి వ్యక్తులతో ఆర్టీఐ వేయించి, ఆ ఆర్టీఐ ఆధారంగా ఆ రికార్డులు సెంటర్లలో వున్నా లేకపోయినా తాను మేనేజ్ చేస్తానని చెప్పి ఒక్కో సెంటర్ నుంచి నగదు వసూలు చేశాడన్న ఆరోపణలు గతంలో వచ్చాయి. అలాగే పదోన్నతులకు సిఫారసు చేస్తానని భారీ మొత్తంలో వసూలు చేసినట్లు మరి కొన్ని ఆరోపణలు వున్నాయి. ఈ అంశాలన్నీ చిలువలు పలువలుగా మారి చివరికి ఆ శాఖ మంత్రి వరకూ వెళ్లాయి. దీంతో అతణ్ణి సస్పెండ్ చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికి రెండు సార్లు సస్పెండైనా అతడి తీరులో ఎలాంటి మార్పూ లేదని, అతణ్ణి శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఎక్సైజ్ సీఐల బదిలీ

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 27: ఎక్సైజ్ సీఐలను బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఎం వెంకటరెడ్డిని గుంటూరు డీసీ స్క్వాడ్ నుంచి ఒంగోలు ఏసీ విజిలెన్స్‌కు, వై అశోక్‌కుమార్‌ను విజయవాడ డిస్టలరీ నుంచి గుంటూరు డీసీ స్క్వాడ్‌కు, రేఖా రెడ్డిని గుంటూరు డిపో నుంచి విజయవాడ డిస్టలరీ వింగ్‌కు, కోటేశ్వరరావును గుంటూరు డిపో నుంచి మార్కాపురం డిపోకు, ఎస్ రామారావును నెల్లూరు డిపో నుంచి గుంటూరు డిపోకు, బీ కిషోర్‌ను ఓజిలి డిపో నుంచి గుంటూరు డిపోకు బదిలీ చేశారు. అదేవిధంగా శ్రీనివాసమూర్తిని తెనాలి డిపో నుంచి డిస్టలరీ వింగ్‌కు, కరీం బేగంను ఒంగోలు డిపో నుంచి తెనాలి డిపోకు, ఎండీ బాషాను నరసరావుపేట డిపో నుంచి ఓజిలి డిపోకు, ఎం ప్రమీలను నరసరావుపేట డిపో నుంచి డిస్టలరీ వింగ్‌కు, బుజ్జిబాబును మార్కాపురం నుంచి నరసరావుపేట డిపోకు, శ్రీరామ్‌ప్రసాద్‌ను డిస్టలరీ వింగ్ నుంచి నరసరావుపేట డిపోకు బదిలీ చేశారు. వీరితోపాటు మరో 12 మంది ఎక్సైజ్ ఎస్ఐలను కూడా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏపీసీసీ వార్ రూమ్ కమిటీ కో ఆర్డినేటర్‌గా సోమశేఖర్

గుంటూరు, జనవరి 27: నూతనంగా ఏర్పడిన ఏపీసీసీ వార్ రూమ్ కమిటీ కో ఆర్డినేటర్‌గా వడ్డి సోమశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. రేపల్లె తాలూకా వడ్డీవారిపాలెంనకు చెందిన సోమశేఖర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగం ప్రొఫెషనల్స్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. సోమశేఖర్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు.

రాజధాని రైతులను రోడ్డున నిలబెట్టారు

● 1502వ రోజుకు రైతుల ఆందోళనలు



వెంకటపాలెం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు జనవరి 27: ఎంత తొక్కాలని చూస్తే.. రాజధాని అమరావతి అంత పైకి ఎదుగుతుందని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1502వ రోజుకు చేరున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడారు. అమరావతిలో భూములు కొట్టేయటానికి వీలు లేదనే విశాఖ రాజధాని అని నాటకాలు ఆడుతున్నారన్నారు. అక్కడ కారుచౌకగా కొన్న వేల ఎకరాల భూముల ధరలు పెంచుకోవటానికి అమరావతిని చంపేయాలనుకున్నారని అన్నారు. రాజధానికి భూమిలిచ్చిన రైతులను అక్కున చేర్చుకోవాల్సి ఉండగా నడిరోడ్డు మీద నిలబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ప్రతిఫలంగా వైసీపీ ప్రభుత్వం అడ్రస్ లేకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా మించి పోయింది లేదు.. అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలలో ఆందోళనలు కొనసాగాయి.

రాష్ట్రానికి పట్టిన చీడ జగన్

● మాజీ మంత్రి దేవినేని ఉమ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దేవినేని ఉమ, పక్కన బి.రామాంజనేయులు

ప్రత్తిపాడు, జనవరి 27: రాష్ట్రానికి పట్టిన చీడ జగన్‌మోహన్ రెడ్డి.. ఆయన్ను బంగాళాఖాతంలో.. 161 అడుగుల గోతిలో పూడ్చి పెట్టాలని మాజీ మంత్రి దేవినేని ఉమ అన్నారు. ఈ నెల 29న చంద్రబాబు నాయుడు పర్యటనను పురస్కరించుకుని ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. మండలాల వారీగా పార్టీ కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌ను పొడిగింపు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నారుమళ్లకు పులిచింతల నీళ్లు ఎందుకు వదలలేదు అని ఓట్లు అడగటానికి వచ్చిన వైసీపీ నాయకులను నిలదీయాలన్నారు. పంట నష్టపరిహారం డబ్బులు ఇవ్వమని కేంద్ర ప్రభుత్వాన్ని అడిగే దమ్ము, ధైర్యం నీకు ఉందా అంటూ జగన్ రెడ్డి అంటూ సూటిగా ప్రశ్నించారు. వెలుగొండ టన్నల్‌లో నీళ్లు ఇవ్వకుండానే, ధర్మల్ పనులు పూర్తి చేయకుండానే సిగ్గు లేకుండా ఫిబ్రవరిలో జాతికి అంకితం అంటూ ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారని రానున్న ఎన్నికల్లో నిన్ను పత్తా లేకుండా పంపడం ఖాయమన్నారు. చంద్రబాబు సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బి.రామాంజనేయులు, నియోజకవర్గ పరిశీలకులు వందనాదేవి, మండల పరిశీలకులు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, తెలుగురైతు రాష్ట్ర మీడియా కోర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు శివరామప్రసాద్, బీసీ నాయకులు భగత్, కల్లూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, అయినంపూడి నాగేశ్వరరావు, ఇనగంటి సుధాకర్, వెలివెల్లి సుబ్బారావు, నాగరాజు, అంకాళం కోటేశ్వరరావు, పాలేటి సాంబశివరావు, రామ్మోహనరావు, మాకినేని జగన్, జాగర్లమూడి మల్లేశ్వరరావు, మల్లంపాటి శేషగిరిరావు, దూపాటి కోటేశ్వరరావు, శివయ్య, కనపర్తి అనిల్, బసవబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెదనందిపాడు, వట్టిచెరుకూరు మండల గ్రామాల్లో దేవినేని ఉమా పర్యటించి కార్యకర్తలతో మాట్లాడారు.

క్రైస్తవ జీవితం ఆదర్శనీయం

● జె.శామ్యూల్ కిరణ్ ● రెండో రోజు బైబిల్ మహోత్సవాలకు పోటెత్తిన భక్తులు



ప్రసంగిస్తున్న శామ్యూల్ కిరణ్

పెదకాకాని, జనవరి 27: క్రైస్తవ జీవితం ఆధునిక మానవాళికి ఆదర్శనీయమని బైబిల్ మిషన్ అధ్యక్షులు జె.శామ్యూల్ కిరణ్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట జరుగుతున్న బైబిల్ మిషన్ 86వ మహోత్సవాలకు రెండో రోజు శనివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, మహా రాష్ట్ర, ఒడిస్సా, ఢిల్లీ నుంచి పెద్దఎత్తున తరలి వచ్చారు. ఈ మహో త్సవాల్లో ఆయన మాట్లాడుతూ ఏక మనసుతో దేవుని ప్రార్థించ డం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించగలమన్నారు. బైబిల్‌లో ప్రాముఖ్యతను సంతరించుకున్న 24 గురుపెద్దల గురించి ఆయన వివరించారు. క్రైస్తవులు మాదిరికరమైన జీవితాన్ని అవలంబించాలన్నారు. దేవుని కోసం సాక్షులుగా నిలవాలని కోరారు. అనంతరం పాస్టర్లు కె.అలెగ్జాండర్, పి.దేవకుమార్, కె.ప్రశాంత్‌కుమార్, ఇమ్మానియేల్ దేవదాస్, వై.శామ్యూల్ ప్రకాష్, యేసేపు, జీవన్ దేవదాసు, ఎలీషా దాస్, దేవదాసు లూథరన్ బాబు తదితరులు దైవ సందేశాన్నందించారు. పెదకాకాని స్వస్థిశాలకు భక్తుల తాకిడి పెరిగింది. దీంతో ఈ క్రమంలో మహోత్సవాల ప్రాంగణం నుంచి ప్రత్యేక ఉచిత బస్సుల ప్రయాణం సదుపాయాన్ని నిర్వాహకులు చేపట్టారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124, 135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

టీడీపీ గెలుపునకు సంఘటితంగా పనిచేయాలి

● దేగల ప్రభాకర్ పిలుపు



గుంటూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ పిలుపునిచ్చారు. పార్టీ నగర కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్త, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను, దౌర్జన్యాలను ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ ప్రవేశ పెట్టిన మినీ మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించాలని ప్రభాకర్ సూచించారు. ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో టీడీపీ విజయంతోపాటు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. యువత ఆలోచించి ఓటు వేయకపోతే రాష్ట్రం అధోగతిపాలవుతుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జగన్‌రెడ్డి చేస్తున్న జిమ్మిక్కులకు ప్రజలు మోసపోకుండా కాపాడాలన్నారు. టీడీపీ-జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే మహిళలకు గౌరవం, యువతకు భవిష్యత్ ఉంటుందనే విషయాన్ని గుర్తించాలన్నారు.

ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయస్థాయి ఏఏ రేటింగ్



సర్టిఫికెట్ ప్రదర్శిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 27: ఎన్‌పీటీఈఎల్, ఐఐటీ-మద్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులలో విద్యార్థులు చూపిన ప్రతిభకుగాను జాతీయస్థాయిలో ఏఏ రేటింగ్, ఎన్‌పీటీఈఎల్ స్టార్స్ డొమైన్‌స్కాలర్ అవార్డులు ఆర్వీఆర్‌అండ్ జేసీ సాధించినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన అవార్డులను, సర్టిఫికెట్‌లను ఇటీవల ఐఐటీ - మద్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్ కన్వీనర్(స్పోక్) డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ రావు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాస రావు, డాక్టర్ ఎమ్‌విపి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మిర్చియార్డులో అభివృద్ధి పనులు రేపు ప్రారంభం

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)లో అభివృద్ధి పనులను పాలకవర్గం చేపట్టింది. ఇప్పటికే పూర్తయిన వివిధ పనులను సోమవారం మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విడదల రజని చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. గుంటూరు మిర్చియార్డులో ఏటా జనవరి నెలాఖరు నుంచి సీజన్ ప్రారంభమౌతుంది. రైతులకోసం గత కొన్నేళ్లుగా మధ్యాహ్న భోజన పథకాన్ని ఉచితంగా రైతులకు అమలుచేస్తున్నారు. ఈ సంవత్సరం అదనంగా అల్పాహారం కూడా అందించాలని పాలకవర్గం నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో రైతుకు రూ.46 చొప్పున ఖర్చు పెట్టనుంది. యార్డు అంతటా 32 టాయ్‌లెట్స్‌ని ఆధునికీకరించారు. రెండు చోట్ల మినరల్ వాటర్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఒక పోలీసు అవుట్‌పోస్టు, రైతు వైద్య శాలని ప్రధాన ముఖద్వారం వద్ద ఏర్పాటు చేశారు. రూ.1.30 కోట్లతో 6 టవర్ లైట్స్‌ని అమర్చారు. రైతుల కోసం రూ.3 కోట్లతో ఒక జంబో షెడ్డుని నిర్మించారు. చిల్లీస్ సిటీ ఆఫ్ ఇండియా లోగోని రూపొందించి సోమవారం ఆవిష్కరించాలని నిర్ణయించారు. రైతుల భోజన/అల్పాహార శాలల్లో టేబుల్స్, కుర్చీలు ఏర్పాటుచేసి నవీకరించారు. వీటన్నింటిని సోమవారం నుంచి రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు యార్డు ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

రెండ్రోజులు కాచి చల్లార్చిన నీటిని తాగండి...

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 27: ప్రకాశం బ్యారేజ్‌కి పులిచింతల నుంచి వస్తున్న నీటిలో టర్బిడిటీ అధికంగా ఉందని, దీనివలన నగరపాలక సంస్థ ఫిల్టరేషన్ పాయింట్స్ తగినంత నీటిని ఫిల్టర్ చేయలేకపోతున్నాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు కూడా రెండు రోజులుపాటు కాచిచల్లార్చి తాగాలని, ఫిల్టరేషన్ సమస్యవలన ఏదైనా ప్రాంతంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినా సహకరించాలని కోరారు.

పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు

● కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమలను మరింతగా ప్రోత్సహించటానికి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మెరుగుపర్చటానికి పారిశ్రామిక కస్టర్ల ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని జిల్లాకలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పరిశ్రమలు, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలక్టరేట్ లో జిల్లా ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ(డీఐఈపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. అనంతరం జిల్లా పర్యావరణ పరిరక్షణ ప్రణాళికా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. అదేవిధంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మాసాంత తనిఖీలలో భాగంగా శనివారం గుంటూరు ఆర్డీవో కార్యాలయం ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రా కదలిరా సభను విజయవంతం చేద్దాం: నసీర్

గుంటూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న గుంటూరు జిల్లా పొన్నూరులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తలపెట్టిన రా.. కదలిరా! కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ కోరారు. పార్టీ తూర్పు కార్యాలయంలో శనివారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వైసీపీ పాలనలో ముస్లింలపై దాడులు: అబ్దుల్ గని

వైసీపీ పాలనలో నాలుగేళ్ల 9 నెలలుగా ముస్లింలపై దాడులు కొనసాగుతూనే వున్నాయని టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ గని అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో లాల్ వజీర్, రుస్తుంబాబు, జాన్ సైదా, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యతోనే మెరుగైన సమాజం

గుంటూరు(విద్య), జనవరి 27: సమాజంలో సామాజిక, రాజకీయ అభివృద్ధి చెందాలంటే పురుషులతోపాటు మహిళలు కూడా విద్యావంతులు కావాలని ఎమ్మెల్సీ కె.కల్పలతరెడ్డి అన్నారు. స్థానిక స్తంభాలగరువులోని ఉడుముల కోటిరత్నం, సాంబిరెడ్డి రెడ్డి బాలికల వసతిగృహంలో అనవేమాట్రస్ట్ నిర్వహించిన స్కాలర్‌షిప్ పంపిణీలో ఆమె మాట్లాడారు. అనవేమా ట్రస్ట్ సభ్యులు ఉడుముల లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, దుంప రవీంద్రారెడ్డి, సృజన, ఆవుల సాంబిరెడ్డి, మారెళ్ళ రాధా, బండి అశోక్‌రెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, వణుకూరి సూరారెడ్డిపాల్గొన్నారు.

క్రెడాయి మెగా ప్రాపర్టీ షోకు అనూహ్య స్పందన



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ చంద్రగిరి యేసురత్నం, పక్కన శివారెడ్డి, రాము తదితరులు

గుంటూరు (కార్పొరేషన్), జనవరి 27: క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో సిద్ధార్థ కన్వెన్షన్ హాల్లో రెండురోజులు నిర్వహిస్తున్న మెగా ప్రాపర్టీ షోకు నగర ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. శనివారం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ చక్కటి వేదికను అందించిన గుంటూరు క్రెడాయ్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. లక్కీడ్రాలో విజేత గుంటూరుకు చెందిన ప్రసాద్‌కు 32 అంగుళాల స్మార్ట్ టీవీని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ క్రెడాయ్ ఛైర్మన్ ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ ఇండిపెండెంట్ హౌసెస్, అపార్ట్మెంట్లు, విల్లాస్, గేటెడ్ కమ్యూనిటీ, వెంచర్లు, ప్లాట్లు అందరికీ అందుబాటు ధరలలో లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రెడాయ్ ప్రెసిడెంట్ వైవీ రమణారావు, ప్రధానకార్యదర్శి బి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఈ ప్రాపర్టీషోకు విశేషస్పందన లభిస్తోందన్నారు. క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము, గుంటూరు ఛైర్మన్ ఆరుమళ్ళ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటు ధరలలో ప్లాట్లు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో క్రెడాయ్ వైస్ ప్రెసిడెంట్ మెట్టు సాంబశివారెడ్డి, కార్యదర్శి తీయకూర వినోద్‌రెడ్డి, ట్రెజరర్ కార్తీక్, నాయకులు ఆళ్ల నాగార్జునరెడ్డి, శివ నాగేశ్వరరావు, రమాకాంత్, బోనా శివనాగబాబు, సాహిత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో నూర్‌బాషాలకు ప్రవేశం కల్పించాలి

● నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని మౌనదీక్ష

గుంటూరు(తూర్పు), జనవరి27: స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా నూర్‌బాషా, దూదేకులకు మాత్రం చట్టసభల్లో ప్రవేశం లేదని, కేవలం వారిని ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని నూర్ బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.పీర్ మహమ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో ప్రవేశం కల్పించాలని కోరుతూ గుంటూరు లాడ్జి కూడలి, అంబేద్కర్ విగ్రహం వద్ద నూర్‌బాషాలు శనివారం నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని, మౌనదీక్ష నిరసన చేపట్టారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మస్తానమ్మ, సంఘ గౌరవ సలహాదారు డాక్టర్ బాబన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, కోశాధికారి దస్తగిరి, నాయకులు పి.సిద్ధయ్య, పెదమస్తాన్, నాగుర్, ఖాజావలి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

గుంటూరు(తూర్పు), జనవరి27: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా రహదారి భద్రతపై శనివారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ సిబ్బందితో పాటు డీటీసీ కరీం, ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు వాహన తనిఖీ అధికారులు టి.రాఘవరావు, గోపాల్, మల్లీశ్వరి, సౌజన్య, సంధ్య, మదుసూదనరావు, ట్రాఫిక్ సిబ్బంది, విద్యార్థులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

మ్యాచ్‌కు హాజరుకానున్న లోకేశ్

మంగళగిరి, జనవరి 27: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళగిరిలో 20 రోజులుగా సాగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ -2 క్రికెట్ టోర్నమెంట్ ముగింపుదశకు చేరుకుంది. ఈ టోర్నమెంటుకు సంబంధించి ఆదివారం మధ్యాహ్నం స్థానిక బైపాస్ వెంబడి ఉన్న బోగి ఎస్టేట్స్‌లో ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌ను నారా లోకేశ్ ప్రత్యక్షంగా తిలకించనున్నారు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో తాడేపల్లికి చెందిన వల్లభనేని వెంకటరావు యూత్, దుగ్గిరాల మండలానికి చెందిన అన్‌స్టాపబుల్ టీమ్ తలపడనున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో లోకేశ్ క్రీడా ప్రాంగణాన్ని చేరుకుని మ్యాచ్‌ను ఆసాంతం తిలకించి ఫైనల్స్ విజేతకు బహుమతులను అందజేస్తారు. అలాగే ఈ టోర్నమెంటులో పాల్గొన్న మొత్తం వంద జట్లకు కూడ క్రికెట్ కిట్‌లను అందించి వారిని అభినందిస్తారు.

రైతుల పాట్ల ఈ-లాటరీ వాయిదా

తుళ్ళూరు, జనవరి 27: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీసీఆర్డీఏ) పరిధిలో గల భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు కేటాయించబడిన ప్లాట్లు, భూసేకరణలో ఉన్న భూముల్లో వచ్చినందున వాటిని మార్చడానికి సీఆర్డీఏ వారు మూడో విడత ఈ లాటరి తీసి కేటాయించాల్సి ఉండగా అది శనివారం వాయిదా పడిందని తుళ్లూరు సీఆర్డీఏ కాంపిటెంట్ అథారిటీ వారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే నెల 5వ తేదీన ఐనవోలు, నేలపాడు, శాఖమూరు, తుళ్ళూరు అనంతవరం, గ్రామాలకు చెందిన రైతులకు విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో ఈ లాటరి తీస్తామని తెలిపారు. రెండు పర్యాయములు నోటీసులు ఇచ్చిననూ సంబంధిత రైతులు హాజరు కానందున వారికి మరో అవకాశం కల్పించుటకు సమయం పొడిగించామని తెలిపారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు (మెడికల్), జనవరి 27: తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద ఆయుర్వేదిక్ హాస్పిటల్, కేరళలోని కొట్టక్కల్ ఆర్య వైద్యశాల అనుబంధ సంస్థ శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గోరంట్ల సమీపంలోని ఇన్నర్ రింగ్ రోడ్‌లో గల భాష్యం రామసేత వెనుక ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ వైద్య శిబిరం జరుగుతుందని ఆయన వివరించారు. పంచకర్మ అనుభవజ్ఞులైన ఆయుర్వేద వైద్యులు నాడీ పరీక్షించి కీళ్ల నొప్పులు, లైంగిక సమస్యలు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఉచితంగా మందులు అందజేస్తారని ఆయన తెలిపారు.

3న కేఎల్‌పీలో జిల్లా స్థాయి స్పెల్‌బీ పోటీలు

గుంటూరు(విద్య), జనవరి 27: స్థానిక కేఎల్‌పీ స్కూల్‌లో ఫిబ్రవరి 3న జిల్లా స్థాయి స్పెల్‌బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి 8, 9, 10 తరగతి విద్యార్థులు ఇద్దరు చొప్పున పాల్గొన వచ్చునని తెలిపారు. ఉదయం 9 గంటలకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి ఇందులో అర్హత పొందిన వారిని ఫైనల్ పోటీల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్‌లో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి27: స్థానిక జీటీ రోడ్డులోని శ్రీ హజరత్ కాలే మస్తాన్‌షా 132వఉరుసు మహోత్సవాలు ఆదివారం నుంచి ఫిబ్రవరి 1 వరకు జరుగుతాయని దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు. విశేషపూజలు, భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని వివరించారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులే : ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు(విద్య), జనవరి 27: విద్యార్థులలో సమాజం పట్ల అవగాహన బాధ్యతతో కూడిన పౌరులుగా ఎదిగేందుకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎంతగానో దోహదపడతారని శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ సోషల్ సైన్సెస్ ఉపాధ్యాయుల ప్రతిభా పురస్కార మహోత్సవం శనివారం స్థానిక విజ్ఞాన మందిరంలో ఘనంగా నిర్వహించారు. సభకు కన్నా మాస్టర్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, పాఠశాల విద్యాశాఖ కోఆర్డినేషన్ డైరెక్టర్ పి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.




CHADALAVADA BROTHERS
PRESENTS
GRAND RELEASE
FEB 2ND
TRAILER
OUT NOW
ధీర
Nizam & Vizag
SRI VENKATESWARA FILMS
Andhra pradesh
RADHAMADHAVI FILMS
#DHEERAMOVIE
/STTVFILMS


FEB
2
2024
GRAND RELEASE
WORLDWIDE
BUNNY VAS & VENKATESH MAHA
PRESENT
అంబాజీపేట
మ్యారేజి బ్యాండు
DHEERAJ MOGILINENI
DUSHYANTH KATIKANENI


GLOBAL FILMS
మీ జీతాలతో మా జీVతాలు మార్చండి
KATHA
FEBరవరి
2nd
టాకీస్ ల కలుద్దాం
బూట్ CUT
బాలరాజు
MD. PASHA
SREE KONETI


ఫిబ్రవరి
2న
విడుదల
TEENA SREE CREATIONS
T-SERIES
MECHANIC
మెకానిక్
TROUBLE SHOOTER
PRODUCER M NAGA MUNEIAH (MUNNA)
CO - PRODUCERS NANDIPATI SRIDHAR REDDY KONDRASI UPENDER
STORY - SCREENPLAY - DIALOGUES - DIRECTION MUNI SAHEKARA
MUSIC VINOD YAJAMANYA LYRICS MUNI SAHEKARA D.O.P S.V.SIVARAM
EDITOR SHIVA SARVANI PRODUCTION EXECUTIVE BANDI SRINIVAS RAO
THRILLS DRAGAN PRAKASH CHOREOGRAPHER KAPIL MASTER, BALU MASTER DIGITAL
PROMOTIONS CHANDRA, VINEETH GOUD, MANOHAR CG CHERRY SANTHOSH
DI ARYAN MOULI PUBLICITY DESIGNS JK FRAMES P.R.O B. VEERABABU
DIRECTION DEPARTMENT THOTA SRIKANTH-TADI SATHYA-JAGAN-PURUSHOTHAM-SUBHANI NAGA BABU


PRIMESHOW ENTERTAINMENT
SRI CHAITANYA PRESENTS
తొంబై రెండు సంవత్సరాల తెలుగు సినిమా
సంక్రాంతి రికార్డుల చరిత్ర తిరగరాసిన హనుమాన్
|| జై శ్రీ రామ్ ||
3RD
WEEK
PRASANTH VARMA CINEMATIC UNIVERSE
హను-మాన్
PRODUCED BY K NIRANJAN REDDY
WRITTEN & DIRECTED BY PRASANTH VARMA
TELUGU HINDI MARATHI TAMIL KANNADA MALAYALAM ENGLISH SPANISH KOREAN CHINESE JAPANESE


PRE GAME EVENT
TOMORROW
FEBRUARY
2ND
RELEASE
WORLWIDE
A DAYANANDH FILM
GAME
ON


MASS MOVIE MAKERS
VALENTINES WEEK RELEASE
MILLION DOLLAR STUDIOS
A MARUTHI TEAM PRODUCT
A SKN RELEASE
TRUE
LOVER
PRABHURAM VYAS
TEASER FROM TOMORROW
think music

తెనాలి వార్తలు

మనిషి జీవితం అమూల్యం

● న్యాయాధికారి జె.శ్రీసీత



మాట్లాడుతున్న న్యాయాధికారి జె.శ్రీసీత

తెనాలి క్రైం, జనవరి 27: మనిషి జీవితం అమూల్యం, ఒక్కసారి కోల్పోతే తిరిగి తెచ్చుకోలేనిదని 2వ అదనపు జ్యూడిషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ జె.శ్రీసీత పేర్కొన్నారు. శనివారం సబ్‌జైలు ప్రాంగణంలో తెనాలి మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఖైదీల నుద్దేశించి ఆమె మాట్లాడారు. కాలం గడపటం ముఖ్యం కాదు, దాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రధానం. అనుక్షణం ఎదురయ్యే ప్రతి సమస్య ఒక పరీక్షే. ప్రతికూల అంశాలను నేర్పుతో, ఓర్పుతో పరిష్కరించుకోవాలి. క్షణికమైన ఆనందాన్ని ఇచ్చే అడ్డదారులు త్యజించాలని ఆమె తెలిపారు. కామం, క్రోధం, అత్యాస, మోసం, అహంకారం, మూర్ఖత్వం వంటి లోపాల వలనే తప్పు చేసి జైలు శిక్ష అనుభవిస్తారు. జైలు జీవితం అనంతమైన జీవితాన్ని సార్థకంగా మలుచుకోవాలని ఆమె ఖైదీలకు సూచించారు. ఈ సందర్భంగా 2015 జువైనల్ జస్టిస్ చట్టం గురించి ఆమె ఖైదీలకు వివరించారు. ఏ ఖైదీ అయినా న్యాయవాదులను నియమించుకోలేని పరిస్థితి ఉంటే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని ఆమె తెలిపారు. అనంతరం ఖైదీల బ్యారెక్‌లను, భోజన వసతులను, ఫాగింగ్, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. న్యాయాధికారి వెంట తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, అప్పల కిషోర్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యడ్లంశెట్టి అనీల్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

తహసీల్దార్ నాంచారయ్య



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాంచారయ్య

కొల్లిపర, జనవరి 27: రేషన్ సరకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దార్ నాంచారయ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ షాపు డీలర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. రేషన్ సరుకుల పంపిణీపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా నాంచారయ్య మాట్లాడుతూ మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా ఇంటింటి సరఫరా ఖచ్చితంగా జరగాలన్నారు. రేషన్ సరుకులు అందలేదని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ జేవీఎస్ఎన్.మూర్తి, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాతపెన్షన్ సాధన సభను విజయవంతం చేయాలి

● యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కేదార్‌నాథ్



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కేదార్‌నాథ్

కొల్లిపర, జనవరి 27: రాజమండ్రిలో ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీలో పాత పెన్షన్ సాధన సభ ఆదివారం జరుగుతుందని మండలంలోని ఉపాధ్యాయులు అందరూ హాజరై విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా కేదార్‌నాథ్ అన్నారు. శనివారం కొల్లిపరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలుపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించడం జరిగిందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు పి.రవిశంకర్, కాలేషావలి, రామకృష్ణప్రసాద్, ఉమాదేవి, వహాబ్, అనంతలక్ష్మి, చింతయ్య, మృత్యుంజయరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాసవీ ఆలయంలో త్యాగరాయస్వామి ఆరాధనోత్సవాలు



ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలి అర్బన్, జనవరి 27: బోసు రోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో సద్గురు త్యాగరాయ స్వామి ఆరాధనోత్సవాలు రెండు రోజుల పాటు జరుగుతాయని సంగీత జగద్గురు సేవా సమితి సభ్యులు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆది, సోమవారాల్లో నిర్వహించే ఆరాధన ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. చెన్నై గాయకులు శాంతలా సుబ్రహ్మణ్యం, వేణుగాన కచేరీ హైదరాబాద్‌కు చెందిన శ్రీధర్ గాత్ర కచేరి చేస్తారని చెప్పారు. కేవీ రామకృష్ణ, వెంకటేశ్వర సాహెబ్, ధన్వంతరి తదితరులు పాల్గొన్నారు.

సమరయోధుల జీవితం నేటి యువతకు ఆదర్శం

● సిబార్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

పెదకాకాని, జనవరి 27: స్వాతంత్ర సమరయోధుల జీవితం నేటి యువతకు ఆదర్శమని తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ కృష్ణప్రసాద్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఘనంగా గణతంత్ర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో మహానుభావులు ప్రాణాలు అర్పించారన్నారు. వారందరి త్యాగ ఫలాలను నేడు మనం అనుభవిస్తున్నామన్నారు. అటువంటి మహనీయులను మనం ఎప్పుడు గుర్తుపెట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ తోట కృష్ణమోహన్, డాక్టర్ మన్నే ప్రకాష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ విద్యార్థినికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న సిబార్ కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్

వైసీపీ నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించాలి

● ప్రతి ఒక్కరూ అందులో భాగస్వాములు అవ్వాలి

● పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్యే నరేంద్రకుమార్



పెదకాకానిలో నరేంద్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పెదకాకాని, జనవరి 27: వైసీపీ నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించాలని, అందులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. పెదకాకాని మండల టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ విస్తృత సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ కబంధహస్తాలలో ఇరుక్కున్న రాష్ట్రాన్ని రక్షించడానికి చంద్రబాబునాయుడు పూరించిన శంఖారావం 'రా.. కదలిరా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొన్నాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం సంఘటితంగా నడుస్తున్న టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో మనమందరం ముందుకు నడవాలన్నారు. టీడీపీని అధికారంలో తీసుకురావాలని చంద్రబాబునాయుడు ఈనెల 29న వడ్లమూడి క్వారీ గుడి దగ్గర, సంగం దాణా ఫ్యాక్టరీ వెనుక పక్కన వున్న ఎన్టీఆర్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన రా.. కదిలిరా.. బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు. అభిమానులు, ప్రజలు వేలాదిగా ఈ సభలో పాల్గొని జయప్రదం చేయవలిసిందిగా కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

పెదకాకాని మండలంలో వైఎస్ఆర్ సీపీకి గట్టి దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన అనేకమంది ముఖ్య నాయకులు శనివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. చేరిన వారిలో మండల మాజీ అధ్యక్షుడు గుంటుముక్కల పూర్ణచంద్రరావు, పొన్నూరు మార్కెట్ యార్డ్ మాజీ మెంబర్ కళ్యాణం శంకర్రావు, వెంకటకృష్ణాపురం గ్రామ ఎంపీటీసీ యోదూరి గోపి, వైసీపీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి కాసుల హరిబాబు, ఉప్పలపాడు మాజీ సొసైటీ డైరెక్టర్ కాసుల శ్రీనివాసరావు, పక్షుల కేంద్రం డైరెక్టర్లు గంగిశెట్టి సాంబశివరావు, కాసుల నాగేశ్వరరావు, కొప్పురావూరు నుంచి కొప్పురాజు కోటేశ్వరరావు, బీసీ నాయకులు సుఖమంచి రోజారావు, ఇంకా 150మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ కమిటీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రా.. కదిలిరా.. కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, జనవరి 27: చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ వద్ద ఈ నెల 29న నిర్వహించనున్న రా కదిలిరా కార్యక్రమానికి తెనాలి నియోజకవర్గం నుండి టీడీపీ శ్రేణులందరం తరలివెళ్దామని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం కొత్తపేట టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ సోమవారం వడ్లమూడి క్వారీ శ్రీ బాలకోటేశ్వర స్వామివారి ఆలయం సమీపంలో నిర్వహిస్తున్న ఈ బహిరంగసభకు మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హాజరవుతున్నారని చెప్పారు. పార్టీ శ్రేణులందరూ నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలందరికి సభ వివరాలు తెలపాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సభ సాక్షిగా చంద్రబాబునాయుడు ఎండగట్టనున్నారని, ప్రజలకు భరోసా కల్పించేలా భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను వివరించి ప్రజలందరికీ తాము అండగా ఉన్నామని ధైర్యం నింపనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడిగా పోటీ చేసి రాష్ట్రప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ పాలన సాగించనున్నదని సభకు తెనాలి నియోజకవర్గం నుండి ప్రజలందరూ పాల్గొనేలా చూడాలని ఆయన పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సినిమాలకు తప్ప వేదాలు, ఉపనిషత్తులకు ఆదరణ ఎక్కడ!

● వేదోపనిషత్తు సదస్సులో జస్టిస్ చలమేశ్వర్



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ చలమేశ్వర్

తెనాలి అర్బన్, జనవరి 27 : సమాజంలో సినిమాలకు తప్ప వేదాలకు, ఉపనిషత్తులకు ఆదరణ ఎక్కడుందని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మహర్షి వ్యాస పీఠం ఆధ్వర్యంలో శనివారం వేదోపనిషత్తు గీతలు ప్రస్థాన త్రయం పేరిట నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రచయిత తాళ్లూరి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో వేద గీత, ఎనటామీ ఆఫ్ యోగ, మహర్షి దయానంద సందేశం అనే అంశాలపై సమీక్ష నిర్వహించారు. సదస్సులో చలమేశ్వర్ మాట్లాడుతూ, భగవద్గీత ఎప్పుడు వినాలనే విషయం ప్రతి ఒక్కరికి అవగాహన కావాలని, గీతా సారం గ్రహించాలని చెప్పారు. ఉపనిషత్తులు అనువాదం చేశారని, వాటిని చదివే ప్రయత్నాలు కొంత మంది చేస్తే వేదం అనువాదం కాలేదని, అందుకే ఎక్కువ మందికి అర్థం కాకుండా ఉండిపోయిందన్నారు. జీవితం, ప్రపంచం అంటే ఏమిటో అర్థం కావాలని, పూర్వం విద్యతో పాటు బుద్ధులు కూడా నేర్పేవారని, మంచి చెడులు తెలుసుకునే వారని, కానీ అవి నేటి సమాజంలో తర్కంగా మారిపోయాయన్నారు. చదువుకోవాలనే కుతూహలం ఉంటేనే మార్కులు ఎన్ని వస్తాయో తెలుస్తుందని, కానీ ఆ ఆసక్తి లేకపోతే ఏ ప్రయోజనం ఉండదనే విషయం గుర్తించాలన్నారు. సహస్రావధాన సార్వభౌమ మేడసాని మోహన్ మాట్లాడుతూ, దయానందుని సందేశం అనే అంశంపై మాట్లాడుతూ, హిందూ సమాజానికి మూలమైన వేదాల్లో లోపాలు కనిపించవని, కుల వ్యవస్థ లేదని, విగ్రహారాధన లేదని, అందరికి దైవ సాక్షాత్కారం పొందే హక్కు ఉండేదన్నారు. వేద కాలంలో పుట్టిన ప్రతి బిడ్డ ప్రతిభ, సామర్థ్యం ఆధారంగా నచ్చిన వృత్తిని, వర్ణాన్ని ఎంచుకునే వారని చెప్పారు. విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య, వెంపటి సత్యనారాయణ, తాళ్లూరి శశల, పూర్వ శాస్త్రవేత్త చందు సాంబశివరావు, గుజ్జర్లమూడి కృపాచారి, వజ్రాల రామలింగాచారి, మొవ్వా సత్యనారాయణ, అయినాల మల్లేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

పైపు లైన్ల లీకులు... రహదారుల జలమయం

● తాగునీరు వృథా అవుతున్నా అధికారుల తాత్సారం



రహదారిపై పారుతున్న లీకైన నీరు

తెనాలి అర్బన్, జనవరి 27: పట్టణంలో పైపులైన్ల లీకేజీలతో రహదారులు జలమయం అవుతున్నాయి. ఇటీవల కాలంలో తాగునీరు వృథాగా పోవడం షరామామూలైంది. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల పక్క రోడ్డులోని రహదారి తరచూ పైపులైన్ల లీకేజీలతో రోడ్డంతా నీటితో నిండి ఉంటోంది. హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలోనే లీకేజీలు జరుగుతున్నప్పటికీ పట్టించుకోకపోవడం విమర్శలకు గురవుతోంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో లీకేజీలు వెంటనే పరిష్కరించకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. పైపులలోకి సమీపంలోకి మురుగు నీరు చేరుతూ తాగునీరు కలుషితం అవుతోంది. మున్సిపల్ అధికారులు సత్వరం స్పందించి వృథాను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దిన మహనీయుడు వెంకట్రావు

● నన్నపనేని సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న నన్నపనేని సుధాకర్

తెనాలి రూరల్, జనవరి 27: వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల స్థాపించి ఎందరో విద్యార్థులకు మంచి విద్యను అందించి ఉన్నతస్థానంలో నిలబెట్టిన మహనీయులు దివంగత నన్నపనేని వెంకట్రావు అని ఆ కళాశాలల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ చెప్పారు. ఆదివారం వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలల వ్యవస్థాపక దినోత్సవాన్ని, దివంగత నన్నపనేని వెంకట్రావు 44వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలను శనివారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఆదివారం ఉదయం ఐతానగర్‌లోని సమతావనంలో దివంగత నన్నపనేని వెంకట్రావు సమాధి వద్ద మాజీ మంత్రులు నన్నపనేని రాజకుమారి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనంద్‌బాబు, పలువురు ఆయన అభిమానులు శ్రేయోభిలాషులు, కుటుంబసభ్యులు కలిసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో నన్నపనేని వెంకట్రావు స్మారక అవార్డుల పురస్కార సభ జరుగుతుందన్నారు. పలు క్రీడల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో మారౌతు సీతారామయ్య, వీఎస్ఆర్ కాలేజ్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, సీహెచ్ నరసింహమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

ముగిసిన ఏసు పవిత్ర పుణ్యక్షేత్రం వార్షికోత్సవం



జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినాను సత్కరిస్తున్న బిషప్ భాగ్యయ్య

పెదకాకాని, జనవరి 27: మండలంలోని నంబూరులో ఏసు పవిత్ర హృదయం పుణ్యక్షేత్ర దశాబ్ది వార్షికోత్సవాలు శనివారం మూడో రోజు ముగిశాయి. ముఖ్య అతిథిగా చిన్నాబత్తిని భాగ్యయ్య సమిష్టిబలి పూజ 45మంది గురువులచే, 30మంది కన్యా స్త్రీలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య మాట్లాడుతూ యేసు పవిత్ర హృదయం నుంచి వెలువడే ప్రేమతో మన జీవితాలను మార్చుకొని, మన కుటుంబాలలో మన సంఘాలలో ప్రేమతో జీవించాలని కోరారు. ఈ పుణ్యక్షేత్రాలను సందర్శించి ప్రార్థించే వారు ఎన్నో గొప్ప అద్భుతాలను చవిచూశారని అన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా మాట్లాడుతూ వేలాదిమందిగా తరలివచ్చిన ప్రజలను అభినందించారు. విచారణ గురువులు ఫాదర్ పూదోట నవీన్‌ని, చర్చి కన్వీనర్ కూచిపూడి మోహన్‌రావుని, సంఘ సభ్యులను అభినందించారు ఎస్‌సిజే సుపీరియర్ ఫాదర్ మైకేల్ అగస్టిన్ అందరినీ ఆశీర్వదించి ప్రార్థించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, చర్చి పాస్టర్లు పాల్గొన్నారు



ఆసరా చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

ఆసరాతో మహిళలకు అండగా నిలిచాం

● ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్, జనవరి 27: వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా మహిళలకు అండగా నిలిచామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. శనివారం పట్టణంలోని 10వ వార్డు సచివాలయంలో తెనాలి పట్టణం 04 నుండి 11వ వార్డుల పరిధిలోని అర్హులైన 292 స్వయం సహాయక సంఘ సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా పథకం నాలుగవ విడత రూ.2కోట్ల 9లక్షల చెక్కును ఎమ్మెల్యే విడుదల చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పలువురు కౌన్సిలర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ ఉద్యోగుల లక్ష్యం



ఆర్టీసీ డ్రైవర్లతో మాట్లాడుతున్న మేనేజర్ అజిత కుమారి

పొన్నూరుటౌన్, జనవరి 27: ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ ఉద్యోగుల ప్రథమ లక్ష్యం అని డిపో మేనేజర్ పి.అజిత కుమారి అన్నారు. శనివారం పొన్నూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్లుగా పనిచేస్తున్న సిబ్బంది, వారి కుటుంబసభ్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ అజిత కుమారి మాట్లాడుతూ మద్యం సేవించి విధులు నిర్వహిస్తే జరిగే అనర్థాల గురించి వివరించారు. డ్యూటీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య నియమాల గురించి తెలియజేశారు. పొరపాట్లు జరిగితే సిబ్బందితోపాటు, ప్రయాణికులపై పడే ఇబ్బందులు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఆర్థిక సాయం



పారిశుధ్య కార్మికులకు ఆర్థిక సహాయం అందచేస్తున్న రావిపాటి ఉదయ్

పొన్నూరుటౌన్, జనవరి 27: మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో వేతనాలు 11 నెలలుగా అందక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న పారిశుధ్య కార్మికులకు ప్రవాసాంధ్రుడు రావిపాటి ఉదయ్ కుమార్ ఆర్థిక సహాయం అందచేశారు. పంచాయతీ కార్యాలయం పరిధిలో కాంట్రాక్ట్, దినసరి కూలీలుగా పనిచేస్తున్న 11 మందికి గత 11 నెలలుగా పంచాయతీలో నిధులు లేక వేతనాలు అందటం లేదు. కార్మికుల సమస్యలు తెలుసుకున్న ఉదయ్ కుమార్ 11 మందికి రూ.1,25,000 ఆర్థిక సహాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో చిగురుపాటి సుబ్బారావు, మారుపూడి భాను తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌కు హాజరుకానున్న లోకేశ్

మంగళగిరి, జనవరి 27: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళగిరిలో 20 రోజులుగా సాగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ -2 క్రికెట్ టోర్నమెంట్ ముగింపుదశకు చేరుకుంది. ఈ టోర్నమెంటుకు సంబంధించి ఆదివారం మధ్యాహ్నం స్థానిక బైపాస్ వెంబడి ఉన్న బోగి ఎస్టేట్స్‌లో ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌ను నారా లోకేశ్ ప్రత్యక్షంగా తిలకించనున్నారు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో తాడేపల్లికి చెందిన వల్లభనేని వెంకటరావు యూత్, దుగ్గిరాల మండలానికి చెందిన అన్‌స్టాపబుల్ టీమ్ తలపడనున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో లోకేశ్ క్రీడా ప్రాంగణాన్ని చేరుకుని మ్యాచ్‌ను ఆసాంతం తిలకించి ఫైనల్స్ విజేతకు బహుమతులను అందజేస్తారు. అలాగే ఈ టోర్నమెంటులో పాల్గొన్న మొత్తం వంద జట్లకు కూడ క్రికెట్ కిట్‌లను అందించి వారిని అభినందిస్తారు.

రైతుల పాట్ల ఈ-లాటరీ వాయిదా

తుళ్ళూరు, జనవరి 27: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీసీఆర్డీఏ) పరిధిలో గల భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిబడిన ప్లాట్లు, భూసేకరణలో ఉన్న భూముల్లో వచ్చినందున వాటిని మార్చడానికి సీఆర్డీఏ వారు మూడో విడత ఈ లాటరి తీసి కేటాయించాల్సి ఉండగా అది శనివారం వాయిదా పడిందని తుళ్లూరు సీఆర్డీఏ కాంపిటెంట్ అథారిటీ వారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే నెల 5వ తేదీన ఐనవోలు, నేలపాడు, శాఖమూరు, తుళ్ళూరు అనంతవరం, గ్రామాలకు చెందిన రైతులకు విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో ఈ లాటరి తీస్తామని తెలిపారు. రెండు పర్యాయములు నోటీసులు ఇచ్చిననూ సంబంధిత రైతులు హాజరు కానందున వారికి మరో అవకాశం కల్పించుటకు సమయం పొడిగించామని తెలిపారు.